క్లుప్తంగా

సూర్యదేవునికి పూజలు



సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవునికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పూడిక తొలగింపు



పుట్టకొండలో మురుగు కాలువలో పూడిక తొలగిస్తున్న కూలీలు

పెదపూడి: పుట్టకొండ గ్రామంలో ఆధునీకరణకు నోచుకోని మురుగు కాలువలో ఆదివారం పూడిక తొలగింపు చర్యలు చేపట్టారు. స్థానిక సర్పంచి వల్లు వెంకటరమణ గత రెండు రోజులుగా పూడిక తొలగింపు పనులు చేయిస్తున్నారు. ఈ కాలువ మట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడంతో మురుగునీరు ప్రవహించడం లేదు. దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై సర్పంచ్ స్పందించి పూడిక తీత పనులు చేపట్టారు. కూలీలను ఏర్పాటు చేసి పనులు చేయిస్తున్నారు. దీంతో ఎంతో కాలంగా పూడుకుపోయిన కాలువకు మోక్షం కలిగింది.

ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ

సీతానగరం: మండలంలోని ఇనుగంటివారిపేటలో ఎస్సీ ఎస్టీ కేసును నార్త్ జోన్ డీఎస్పీ ఎ.శ్రీనివాస్ ఆదివారం విచారించారు. గత నెల 31న ఇనుగంటివారిపేటకు చెందిన నూతూరి సుబ్రహ్మణ్యం మద్యం తాగి, పాత గొడవలు దృష్టిలో ఉంచుకుని నల్లి భాను ఇంటికి వచ్చి కులంపేరుతో దూషిస్తూ అక్రమంగా ఇంటిలోకి ప్రవేశించి, కొట్టాడని భాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై టి.రామకృష్ణ కేసు నమోదు చేశారు. నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీనివాస్ విచారణ జరిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

మధురపూడి: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు జరుపుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన పెంచాలని బీజేపీ రాష్ట్ర నాయకులు, ఏలూరు జిల్లా ఇన్‌చార్జి ఏపీఆర్ చౌదరి అన్నారు. ఆదివారం కోరుకొండ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మంటపంలో నిర్వహించిన పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పరిమి రాధాకృష్ణ, ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి పాల్గొన్నారు.

నేడు గిరిజన సాంస్కృతిక మహోత్సవం

రాజానగరం: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సోమవారం ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జరగబోయే ఆదివాసి సాంస్కృతిక మహోత్సవాన్ని జయప్రదం చేయాలని టీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిభాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం జరిగిన సమావేశంలో టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప ,రాష్ట్ర కార్యదర్శి విష్ణు నాయక్ మాట్లాడుతూ గిరిజన సాంస్కృతిక, సంప్రదాయాలు దేశానికి పట్టుగొమ్మలు లాంటివి అని, వాటిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆధునికత సోకని గిరిజన కళారూపాలు మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిరూపం అని ప్రపంచీకరణ నేపథ్యంలో అంతరించిపోతున్న వాటిని కాపాడుకోవాలన్నారు. టీఎస్ఎఫ్ నాయకులు రాజకుమార్ రెడ్డి, చిన్న పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతో క్యాన్సర్ దూరం

రాజమహేంద్రవరం సిటీ: మంచి ఆహారపు అలవాట్లతో క్యాన్సర్ మహమ్మారిని తరిమి కొట్టవచ్చునని జేసీఐ న్యూ హారిజన్స్ అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి ప్రియాంక పేర్కొన్నారు. క్యాన్సర్ డే ను పురస్కరించుకుని ఆదివారం జేసీఐ శ్రీమేధ, జేసీఐ న్యూ హారిజన్స్ సంయుక్త ఆధ్వర్యంలో పుష్కర్ ఘాట్ నుంచి కోటగుమ్మం వరకూ క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌కే మాల్‌లో క్యాన్సర్ వ్యాధి గుర్తింపు, నివారణ తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అమూల్య దాసరి, యర్రా శ్రీరామ్ పాల్గొన్నారు.

గోరుముద్ద మరింత రుచికరం

- విద్యార్థులకు పౌష్టికాహారం
- రోజు విడిచి రోజు రాగి జావ
- వడ్డించే ఆహారం మోతాదును పెంచిన ప్రభుత్వం
- తరచూ అధికారుల పర్యవేక్షణ



పెదపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈఓ-2 సత్యనారాయణ

పెదపూడి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందిస్తున్నారు. దీనిద్వారా ఆరోగ్యంతో పాటు చదువుల్లో రాణిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేశారు. చిన్నారులకు పోషక విలువలు పెంచేందుకు వారంలో రోజు చిక్కితో పాటు ఉడికించిన గుడ్డు ఆహారంలో అందిస్తూ గోరుముద్ద మరింత రుచికరంగా చేశారు. దీంతో విద్యార్థుల్లో ఐరన్ ఇతర పోషకాలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది నుంచి వారంలో 3 రోజులు ఉదయం 9 గంటలకు రాగి జావ అందిస్తున్నారు. గుడ్డు సైజు పెంచి, వడ్డించే ఆహారంలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. గతంలో వారంలో మూడు సార్లు మాత్రమే గుడ్డు సరఫరా చేస్తుండగా తాజాగా రోజు సరఫరా చేస్తున్నారు. ఏ వారం అందించే గుడ్డుపై ఆ రంగులను ప్రభుత్వం ముద్రిస్తోంది. దీంతో విద్యార్థులకు తాజా గుడ్లు అందించేందుకు వీలుగా ఉంటుందని ఉపాధ్యాయుల వంట ఏజెన్సీ నిర్వాహకులు చెప్పారు.

మధ్యాహ్న భోజనంపై పెరిగిన పర్యవేక్షణ

గతంలో మధ్యాహ్న భోజనం పథకం అమలుపై ఏలాంటి పర్యవేక్షణ ఉండేది కాదు. తహసీల్దార్, ఎంపీడీఓ, ఆ పాఠశాల హెచ్‌ఎం మాత్రమే మధ్యాహ్న భోజనం కమిటీ సభ్యులుగా ఉండేవారు. ప్రస్తుతం జగనన్న గోరుముద్ద సక్రమంగా అమలు అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు వారి విధుల్లో భాగంగా మండల కేంద్రాలకు, గ్రామాలకు వెళ్లినప్పుడు మధ్యాహ్న భోజనం నిర్వహణపై తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అలాగే ప్రజాప్రతినిధులు ప్రధానోపాధ్యాయులు పీఎంపీ కమిటీలు, గ్రామ, వార్డు సచివాలయ అధికారులు పర్యవేక్షణ కమిటీ బాధ్యతలు అప్పగించారు. దీంతో ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులకు జగనన్న గోరుముద్ద నాణ్యతగా పౌష్టికంగా అందుతోంది.

మెనూ ఇలా

సోమవారం: పలావు/హాట్ పొంగల్, ఉడికించిన కోడిగుడ్డు,చిక్కి
మంగళవారం: ఉదయం రాగిజావ, నిమ్మకాయ, పలిహోర, పచ్చడి, గుడ్డు
బుధవారం: కూరగాయల అన్నం, ఉడికించిన గుడ్డు, చిక్కి
గురువారం: ఉదయం రాగిజావ, సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు
శుక్రవారం: అన్నం ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు,చిక్కి
శనివారం: ఉదయం రాగిజావ, ఆకుకూర, అన్నం పప్పుచారు, తీపి పొంగల్

అనపర్తి నియోజకవర్గంలో

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, పెదపూడి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో సుమారు 179 ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వాటిలో సుమారు మంది విద్యార్థులు విద్యాభ్యసం చేస్తున్నారు. వారిలో మంది విద్యార్థులు మధ్యాహ్నభోజనం చేస్తున్నారు.

భోజనం రుచిగా ఉంటోంది



నేను రోజూ పాఠశాలలో మధ్యాహ్న భోజనమే చేస్తాను. రోజుకో రకం భోజనం పెడుతున్నారు. చాలా రుచిగా ఉంటోంది. పోషకాలతో కూడిన రాగిజావ ఇస్తున్నారు. మాకు ఇష్టమైన కోడిగుడ్డును సైతం అందిస్తున్నారు. నాతోపాటు స్నేహితులందరు ఇష్టంగా తింటున్నాం.

– ఎం.జెస్సికా, తొమ్మిదో తరగతి, గాంధీమెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పెదపూడి

తరచూ తనిఖీలు



ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తరచూ తనిఖీలు చేస్తున్నాం. భోజనం రుచిగా ఉంటుంది. మండలానికి ఇద్దరు ఎంఈఓలు ఉండటంతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉంటున్నారు.

– పి.ఆశాజ్యోతి, ఎంపీడీఓ పెదపూడి మండలం

ఆరోగ్యకరం



జగనన్న గోరుముద్ద పథకంతో విద్యార్థుల్లో ఐరన్ పెరిగింది. ఇటీవల జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కొంతమంది విద్యార్థులు చేయించుకున్న వైద్య పరీక్షల్లో పోషకవిలువలతో కూడిన భోజనం తీసుకోవడంతో వారిలో ఐరన్ శాతం పెరిగినట్టు వైద్యులు గుర్తించారు. భోజనంలో లోపం ఉంటే వెంటనే ఫిర్యాదు చేయాలని ఫిర్యాదుల బాక్స్ ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేశాం.

– సీహెచ్‌వీవీ సత్యనారాయణ, మండల విద్యాశాఖాధికారి-2, పెదపూడి

మెట్టు మెట్టుకు కొబ్బరి కాయ కొడుతూ నరసన్నకు మొక్కు



స్వామికి పూజలు నిర్వహించిన చిన్న వెంకన్నబాబు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల శ్రీ మహాలక్ష్మి సమేత చిన్న వెంకటేశ్వరస్వామి పీఠాధిపతి చిన్న వెంకటన్నబాబు కోరుకొండలో కొలువుదీరిన స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని ఆదివారం దర్శించుకున్నారు. కొండపైకి మెట్టు, మెట్టుకు కొబ్బరి కాయకొడుతూ వినూత్నమైన భక్తిని ప్రదర్శించారు. అయోధ్యలో బాల రాముల వారి ప్రతిష్ఠ దిగ్విజయంగా జరిగినందుకు, రాబోయే రోజుల్లో ఇంటర్, పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో విజయాన్ని సాధించాలని, ప్రజలను ఆయురారోగ్యాలతో కాపాడానికి కోరుకుంటూ నారసింహస్వామి మంత్రోచ్చరణతో మెట్టు, మెట్టుకు కొబ్బరి కాయలు 600 కాయలు కొట్టారు. కొండపైన కొలువుదీరిన స్వామిని దర్శించుకున్నారు. మన గుడి-మనసేవ ఆధ్యాత్మిక సేవా సమితి చైర్మన్ మతల రమేష్, సభ్యులు సూరిబాబు, శివ, పూర్ణిమ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

బిక్కవోలు: స్థానిక మండల సమావేశపు హాలులో సోమవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వ సభ్య సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి అధ్యక్షతను జరిగే ఈ సమావేశానికి అధికారులు తమ శాఖల సబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డాక్టర్ గూడూరి



పుష్పగుచ్ఛంతో గూడూరికి అభినందనలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం లోక్‌సభ సమన్వయకర్తగా నియమితులైన డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని మర్యాదపూర్వంగా కలిసారు. ఆదివారం అనపర్తి వచ్చిన గూడూరి శ్రీనివాస్ దంపతులు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి గూడూరికి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు, నాయకులను గూడూరి శ్రీనివాస్‌కు పరిచయం చేశారు. అనంతరం డాక్టర్ గూడూరి దంపతులను ఎమ్మెల్యే చేతులమీదగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరక్టర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కర్రి దాను, కొమరిపాలెం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ పెదపూడి మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, వ్యవసాయ సలహామండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సొంతిల్లు జగనన్నతోనే సాధ్యం

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- కణుపూరులో 95 మందికి ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ



కణుపూరులో ఇళ్ల స్థలాల పట్టాను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజా

మధురపూడి: ఇల్లులేని నిరుపేదలకు సొంతిల్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమవుతోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం కోరుకొండ మండలం కణుపూరులో 95 మంది స్వంతిల్లులేని పేదవర్గాలకు చెందిన మహిళలకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికీ స్వంతిల్లుండాలనే కోరిక ఉంటుందని, అయితే గత చంద్రబాబు ప్రభుత్వం పేదవర్గాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. కనీసంగా కూడా పట్టాలు పంపిణీ జరగలేదన్నా రు. సమస్యల పరిష్కారానికి కూడా ప్రాధాన్యమివ్వలేదని దుయ్యబట్టారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా 31.75 లక్షలమంది పేదలకు ఇళ్లస్థలాల పట్టాల్చిన దేశంలోనే ఏకైక రాష్ట్ర ప్రభుత్వంగా నిలిచిందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు, అభివృ ద్ధి కార్యకలాపాలను నిర్వహించడం చెప్పుకోదగ్గ విషయమన్నారు. నవరత్నాల అమలుతో పాటుగా, నిరుపేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారన్నారు. ఇళ్ల స్థలాల పంపిణీ అనేది నిరంతర ప్రక్రియన్నారు. అర్హులైన వారందరికీ స్థలాలు, పట్టాల పంపిణీ జరుగుతోందన్నారు. సచివాలయంలో నమోదు చేసుకున్న 90 రోజుల్లోనే సమగ్ర విచారణ జరిపి పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. సర్పంచ్ కరణం రమణ, ఎంపీటీసీ సభ్యురాలు దొడ్డి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కళ్యాణం చిట్టిబాబు, కళ్యాణం రాంబాబు, దొడ్డి వీరబాబు, గ్రామ సెక్రటరీ భవానీ పాల్గొన్నారు.

చట్టసభల్లో ఎక్కువ మంది బీసీలు అడుగుపెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సానబోయిన రామారావు

ప్రకాశం నగర్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ సీటు బీసీ వర్గానికి చెందిన డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు కేటాయించినందున, టీడీపీ -జనసేన కూటమి కూడా ఎంపీ సీటు బీసీలకే ఇవ్వాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సానబోయిన రామారావు మాట్లాడుతూ టీడీపీ బీసీ ఓటు బ్యాంకును కాపాడుకోవాలంటే ఎంపీ సీటును ధనిక వర్గానికి చెందిన ఓసీకి కాకుండా ఈసారి బీసీకి కేటాయించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నరసాపురం ఎంపీ సీటు కూడా న్యాయవాది గూడూరి ఉమాబాలకు ఇచ్చిందని గుర్తు చేశారు. గోదావరి జిల్లాల్లో బీసీలు అధికంగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలకే టిక్కెట్లు కేటాయించాలని కోరారు. చట్టసభల్లో బీసీలు ఎక్కువగా అడుగు పెట్టాలంటే టీడీపీ, వైకాపా బీసీ అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సంఘం గౌరవాధ్యక్షుడు మేడిశెట్టి తాతబ్బాయి, ప్రధాన కార్యదర్శి గొర్సా తాతబ్బాయి యాదవ్, ఉపాధ్యక్షుడు ఉప్పిడి గంగాధర్ కోశాధికారి గుత్తుల సుబ్రహ్మణ్యం మాట్లాడారు.

తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డు తాత్కాలికంగా మూసివేత

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం తాడితోట వీరభద్రపురం నుంచి తూర్పు రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డును నగరపాలక సంస్థ అధికారులు రెండురోజుల నుంచి నిలుపుదల చేశారు. ఎండోమెంట్ ఆవ వాంబేకాలనీ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం వేగంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఆప్రాంతంలో రోడ్డును తవ్వి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. దీంతో వాహనాలు రాకపోకలను నిషేధిస్తూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. నగరం నుంచి బాలాజీపేట ప్రాంతానికి వెళ్లేవారు, అటు నుంచి నగరానికి వచ్చే వాహన చోదకులు షెల్టాన్ హోటల్ పక్క నుంచి ఆవవాంబేకాలనీలో అపార్టుమెంట్ల మధ్యన వేసిన కొత్తరోడ్డు నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

50 వేల మెజార్టీతో విజయం సాధిస్తా

ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా



జనసేన నుంచి పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రాజా

రాజానగరం: రాబోయే సార్వత్రిక ఎన్నికలలో రాజానగరం నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా 50 వేల ఓట్లు పైబడిన మెజార్టీతో విజయ సాధిస్తానని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ధీమాను వ్యక్తం చేశారు. జనసేన పార్టీకి చెందిన రాజానగరం- 3 ఎంపీటీసీ సభ్యుడు వల్లభశెట్టి రమణ (డబ్బు), వెలుగుబందకు చెందిన నున్న రాజు సుమారు వంద మంది అనుయాయులతో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి స్వాగతం పలుకుతూ స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులతోపాటు సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. కుల, మతాలు, పార్టీల రంగులు చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రజారంజకమైన పాలనకు ఆకర్షితులైన వారు ప్రతిపక్షాల నుంచి స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలోకి వస్తున్నారన్నారు. ఈ కోవలోనే నియోజకవర్గంలో జనసేన పార్టీ నుంచి కూడా వలసలు పెరిగాయన్నారు. ఈ విధంగా నియోజకవర్గంలో ఆ పార్టీ ఖాళీ అవడానికి గల కారణం, అడ్డదారిలో వచ్చిన అవినీతి సొమ్ముతో, ధనగర్వంతో కొట్టుమిట్టాడుతూ, ఆ పార్టీ అభ్యర్థిని తానేనంటూ తనకు తానే ప్రచారం చేసుకుంటున్న వ్యక్తేనన్నారు. నేడు రమణ, నిన్న మేడూరి గురుదత్తప్రసాద్, మొన్న రాయపురెడ్డి చిన్న వంటి స్థామినా ఉన్న వ్యక్తులు ఆ పార్టీలో ఇమడలేకనే బయటకు వచ్చేస్తున్నారన్నారు. ఈ వలసలు ఇంతటితో ఆగవని, నియోకవర్గంలో జనసేన పార్టీ ఖాళీ అవడం ఖాయమన్నారు.

వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన అభివృద్ధిని, గత ప్రభుత్వాల కాలంలో జరిగిన అభివృద్ధి బేరీజు వేసి, రాబోయే ఎన్నికలలో మీ తీర్పునివ్వాలని ప్రజలను కోరారు. కరోనా వైరస్ వంటి విపత్కర సమయంలో కూడా ప్రజా సంక్షేమాన్ని విస్మరించకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. అంతకు ముందు రాజానగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.



రాజానగరంలో మోటారు బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజా, పార్టీ శ్రేణులు

కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, పార్టీ నాయకులు రాయపురెడ్డి చిన్న, గంగిశెట్టి సోమేశ్వర రావు, సర్పంచ్ కుందేటి ప్రసాద్, ఉపసర్పంచ్ కొల్లి వీర్రాజు, పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- సుభద్రంపేట, ఈలకొలను గ్రామాల్లో నూతన భవనాలు ప్రారంభం
- ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌తో కలసి ప్రారంభం



సుభద్రంపేటలో వెల్నెస్ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు రాజా, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, పార్లమెంటరీ సమన్వయకర్త శ్రీనివాస్

రంగంపేట: అర్హులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. రంగంపేట మండలంలోని సుభద్రంపేట, ఈలకోలను గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు కూటి సాయితాతారావు, చింతపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో రూ.1.76 కోట్లతో నిర్మించిన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్ల భవనాలను అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, రాజమహేంద్రవరం పార్లమెంట్ సమన్వయకర్త గూడూరి శ్రీనివాస్‌తో కలసి ఆదివారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించి సమావేశాల్లో రాజానగరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఎవరికైనా పింఛను కావాలన్నా, రేషన్‌కార్డు కావాలన్నా, హౌసింగ్ రుణం కావాలన్నా గ్రామాల్లోని రాజ్యాంగేతర శక్తులైన, టీడీపీ ఏర్పాటు చేసిన ఒక అవినీతి వ్యవస్థ సభ్యుల వద్దకు వెళ్లి బతిమలాడుకోవలసిన పరిస్థితి ఉండేదన్నారు. సైకిల్ పార్టీకి ఓటేసిన వారికి, చంద్రబాబుకు జై కొట్టిన వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందేవన్నారు. జన్మభూమి కమిటీల చేతులు, జేబులు తడిపితేనే మేలు జరిగేదన్నారు. వైఎస్సార్ సీపీ వచ్చిన తర్వాత ఏఒక్కరికీ ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వక్కరలేకుండా మీ ఇంటికే వచ్చి మీ తలుపు తట్టి దరఖాస్తు చేయించి అర్హతనే ప్రామాణికంగా, రాజకీయ, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఈ రెండు ప్రభుత్వాలకు ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించి రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటేసి మరొకసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో జనన, మరణ ధ్రువపత్రాలు, ఇళ్ల సథలాల పట్టాలు, కుల ధ్రువీకరణ తదితర సేవలు పొందాలంటే కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేదని, సీఎం జగన్ అధికారంలో ఎలాంటి వ్యయ ప్రయాసలు లేకుండా ఇంటి వద్దకే వస్తున్నాయన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో చంద్రబాబు మళ్లీ మాయ మాటలు చెబుతున్నాడని, అమలు కాని హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని అందరూ అది గుర్తించాలని తెలిపారు. జగనన్నను ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. రాజమహేంద్రవరం పార్లమెంటరీ సమన్వయ కర్త డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయాన్ని పండగగా మార్చేందుకు రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం అద్భుతమైన కార్యక్రమం చేపట్టిందని, గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి నుంచి రైతులకు భరోసా కల్పించడమే లక్ష్యంగా ఈ ఆర్‌బీకేలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిందన్నారు. రైతులకు అన్ని సదుపాయాలు గ్రామాల్లోనే ఉండేలా చర్యలు చేపట్టిందన్నారు. రైతుభరోసా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండి రైతులకు అవసరమైన సహకారాన్ని అందిస్తారని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యానికి ఇబ్బందులు పడకుండా అన్ని వైద్య సేవలు అందేలా ఏర్పాటు చేశారన్నారు. ఎల్లప్పుడు ప్రజల అవసరాలను గుర్తించిన ప్రభుత్వాన్నే మనం ఎంచుకోవాలని సూచించారు. అనంతరం అర్హులైన మహిళలకు ఇంటి పట్టాలను ఎమ్మెల్యేలు రాజా, సూర్యనారాయణ రెడ్డి, పార్లమెంట్ సమన్వయకర్త గూడూరి శ్రీనివాస్ పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలను జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అంతకుముందు రాజమహేంద్రవరం పార్లమెంట్ సమన్వయకర్తగా నియమించిన డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గ్రామాల్లోని ప్రజలకు ఎమ్మెల్యేలు రాజా, సూర్యనారాయణరెడ్డి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, జెడ్పీకోఆప్షన్ సభ్యుడు లంక చందన్న, అనపర్తి ఏఎంసీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, వైస్ ఎంపీపీలు మట్టా శ్రీను, రాయుడు రాంబాబు, మండల జేఏసీ కన్వీనర్ మేడిశెట్టి రవిశంకర్, పంచాయితీరాజ్ జేఈ కె.శ్రీనివాసరావు, కార్యదర్శి మణికుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

రాజానగరం: రాష్ట్రంలో ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే తలంపుతో ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నియోజకవర్గానికి చెందిన 26 మందికి మంజూరైన రూ.35.68 లక్షల విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు రాజమహేంద్రవరంలో ఆదివారం అందజేశారు. కోరుకొండ మండలం, శ్రీరంగపట్నానికి చెందిన కళాకారులు కొందరు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో అసువులు బాశారని, మరికొందరు క్షతగాత్రులయ్యారన్నారు. వారికి కూడా చేయూతనందిస్తామన్నారు.